# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 8, ఏప్రిల్ 2026


## విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

✳ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మందమర్రి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేకత వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. వంటశాల, సామాగ్రి నిల్వగదిని పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, ఆహారం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. తెలంగాణ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్య, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతానికి అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, మిగతా 2లో..

# ప్రాణహిత చేవెళ్లకు కొత్త ఊపిరి..



- ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధం
- పాత డిజైన్ల ఆధారంగా మార్పులు చేర్పులు
- ఉమ్మడి ఆదిలాబాద్‌కు జలసిరులు



**పెంచికల్‌పేట్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు పనులను మొదలు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రాజెక్టు పాత డిజైన్ల ఆధారంగా మార్పులు, చేర్పులతో నీటిపారుదల శాఖ అంచనాలు రూపొందిస్తుంది. దీంతో సాగునీరందని తెలంగాణ మాగాణానికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రాణహిత ప్రాజెక్టు జీవం పోయనుంది. గోదావరి పరివాహక పరిధిలోని అన్ని జిల్లాలు గ్రామాలకు ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. తాజాగా సోమవారం బాసర పర్యటనలో భాగంగా ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మహారాష్ట్ర సరిహద్దు సమీపంలోని తుమ్మిడిహట్టి గ్రామంలో బ్యారేజీని నిర్మించే ప్రణాళికతో ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో లక్షలాది ఎకరాలకు నీరందించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రాణహితచేవెళ్ల నీటిపారుదల ప్రాజెక్టును పునరుద్ధరించింది.

2 లో..

## ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేసిన రైస్‌మిల్ యజమానుల అరెస్ట్

● నకిలీ పత్రాలతో ప్రభుత్వాన్ని మోసం చేసిన కేసులో నిందితులు రిమాండ్



**సిర్పూర్ (టి), ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రభుత్వానికి చెందిన ధాన్యాన్ని దుర్వినియోగం చేసిన కేసులో సిర్పూర్ (టి) మండలం వెంకటరావుపేట గ్రామానికి చెందిన శ్రీ సాయి బాలాజీ అగ్రో టెక్ రైస్ మిల్ యజమానులు రేణిగుంట్ల శివకుమార్, రేణిగుంట్ల పద్మజ, బుద్ధ మనీష్, బుద్ధ మాధురి లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజిఎస్‌సిఎస్‌సిఎల్)తో కస్టమ్ మిల్లింగ్ ఒప్పందం కుదుర్చుకున్న ఈ నలుగురు నిందితులు రబీ 2023-24 సీజన్‌కు సంబంధించిన ప్రభుత్వ వడ్లను మిల్లింగ్ చేసి బియ్యంగా ప్రభుత్వానికి అందించాల్సి ఉండగా, ఆ బాధ్యతను నిర్వర్తించకుండా భారీగా అక్రమాలకు పాల్పడ్డారని విచారణలో వెల్లడైంది. దర్యాప్తులో సుమారు 1825.744 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దుర్వినియోగం చేసినట్లు, ఫైన్, వడ్డీతో కలిపి మిగతా 2లో..

## మెరుగైన ఆరోగ్య వైద్య సేవలు అందించాలి

★ కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**

జిల్లాలోని మారుమూల ప్రాంతాలలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. సుబోద్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, పట్టణ దవాఖానాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజా సంక్షేమం కోసం మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు మిగతా 2లో..

# ప్రాణహిత చేవెళ్లకు కొత్త ఊపిరి..

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన డాక్యుమెంటేషన్ తయారీ పరీక్షలతో సహా సన్నాహక పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు నీటిపారుదల సలహాదారు యోగి ఆదిత్యనాథ్ దాస్ ను నియమించారు. సవరించిన రేట్లకు ప్రాజెక్టును పూర్తి చేయడంలో కాంట్రాక్టర్లతో ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. తుమ్మిడిహట్టి బ్యారేజీకి పూర్తి జలాశయ మట్టం 148 మీటర్ల వద్ద నిర్వహించాలని భావిస్తున్నారు. ఇప్పటికే కేంద్ర జల సంఘానికి వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డిపిఆర్) ను ప్రభుత్వం సమర్పించింది. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రూ. 17.875 కోట్లుగా అంచనా వేయబడిన ఈ ప్రాజెక్టు వ్యయం ఆ తర్వాత రూ. 36.257 కోట్లకు పెరిగింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పేరుతో ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును రీడిజైన్ చేయకమునుపే రూ. 11.678 కోట్లను ఖర్చు చేశారు. సుందిళ్ల లింకు ద్వారా సవరించిన సాధ్యసాధ్యలను ప్రభుత్వం అధ్యయనం చేసింది. సవరించిన అంచనాల వల్ల ప్రాజెక్టు వ్యయం దాదాపు 10 నుండి 12 శాతం వరకు తగ్గనుంది. అంతేకాకుండా భూసేకరణ కూడా దాదాపు సగానికి తగ్గనుంది. తెలంగాణలోని ఎత్తైన ప్రాంతాలు కరువు పీడత ప్రాంతాలకు గోదావరి జలాలను తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నడుం బిగించింది.

### నాలుగు జిల్లాకు సాగునీటి వరం...

### లక్షల ఎకరాలకు జీవం

ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న రైతంగానికి ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు పూర్తి అయితే ప్రాంతం మొత్తం అభివృద్ధి దిశగా కీలక మలుపు తిరగనుంది. వర్షాధార వ్యవసాయంపై ఆధారపడి ఎండలకు బీడ్లుగా గురవుతున్న భూములకు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలకు ఈ ప్రాజెక్టు జీవనాడిగా మారనుంది. ప్రాజెక్టు ద్వారా గోదావరి ఉపనది ప్రాణహిత నది జలాలను వినియోగించి ఈ నాలుగు జిల్లాల్లో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ప్రాణహిత ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అమలయితే ఉమ్మడి ఆదిలాబాద్ కు సుమారు 5 నుంచి 6 లక్షల ఎకరాలకు పైగా సాగునీరందే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం బీడు బారిన భూములు పచ్చదనంతో కళకళలడుతూ వరి, పత్తి, మిర్చి, సోయాబీన్ వంటి పంటలకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. రైతులు ఒకే పంటకు పరిమితం కాకుండా రెండు పంటలు పండించే అవకాశం లభించి వారి ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. నీటి లభ్యతతో భూగర్భ జలాలు పెరిగి బోర్లు ఎండిపోవడం వంటి సమస్యలు తగ్గుముఖం పడతాయి. గిరిజన ప్రాంతాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. నీటి అందుబాటుతో పారిశ్రామిక రంగం కూడా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. మంచిర్యాల వంటి ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న పరిశ్రమలకు నీటి మద్దతు లభించడంతోపాటు కొత్త పరిశ్రమలు స్థాపించేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. దీని వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. జిల్లాల వారిగా చూస్తే అదిలాబాదులో అడవి ప్రాంతాల్లో సాగు విస్తరణకు దోహదం చేయగా, నిర్మల్ జిల్లాలో వ్యవసాయ రంగానికి కొత్త ఊపిరి లభిస్తుంది. మంచిర్యాలలో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతమవుతుండగా, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఇది ప్రధాన బలంగా నిలుస్తుంది. మొత్తంగా ప్రాణహిత ప్రాజెక్టు పూర్తి అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వ్యవసాయం, తాగునీరు, ఉపాధి, పారిశ్రామిక రంగాల్లో సామాగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. ఎండలు, బీడు భూములతో అలమటిస్తున్న ఈ ప్రాంతం పచ్చని భవిష్యత్తు వైపు అడుగులు వేయనుంది. ప్రజల దశాబ్దాల ఆశలు నెరవేరే దిశగా ప్రాజెక్టు కీలకపాత్ర వహించనుంది.

## డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవం

భైంసా, ఏప్రిల్ 07, ప్రభాతవార్త



నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జువాలజీ విభాగం ఆధ్వర్యంలో భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. రఘునాథ్ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ సదస్సులో వైద్య నిపుణులు పాల్గొని విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన హృదయ రోగ నిపుణులు డా. మహేష్ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటుకు గురైన వారిని కాపాడేందుకు సీపీఆర్ పక్రియ ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సీపీఆర్ నిర్వహించే విధానాన్ని ప్రాయోగికంగా వివరించారు. అనంతరం డా. ఎం. రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ఉండాలని, మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. డా. నాగేష్ మాట్లాడుతూ సమతుల్య ఆహారం, పోషకాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ సమన్వయకర్త డా. రవి కుమార్, సీనియర్ అధ్యాపకులు డా. భీమరావు, డా. పవన్ పాండే, డా. ఎం. శంకర్, ఆర్. రాజు, డా. ఓంప్రకాశ్ పాల్గొన్నారు. కార్యక్రమ సమన్వయకర్త డా. కె. సంతోష్ కుమార్ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా నిలిచిందని కళాశాల వర్గాలు తెలిపాయి.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి, ఏప్రిల్ 07, ప్రభాతవార్త

బెల్లంపల్లి పట్టణంలోని 23వ వార్డులో అగ్ని ప్రమాదానికి గురైన గొడుగుల విజయలక్ష్మి అనే మహిళ ఇంటిని మున్సిపల్ అధికారులు పరిశీలించారు. ఈ పరిశీలన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు జరిగింది. బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామితో చరవాణిలో మాట్లాడి వివరాలను తెలియజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశిస్తూ, త్వరితగతిన పంచనామా పూర్తి చేసి ప్రభుత్వం నుంచి లభించే సహాయాన్ని బాధిత కుటుంబానికి అందేలా చూడాలని సూచించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ జంగం కల్పన, కౌన్సిలర్ శ్రావణ్, కాంగ్రెస్ నాయకులు కంకటి శ్రీనివాస్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## శుద్ధి చేసిన నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### - బెల్లంపల్లి సబ్‌డివిజన్ డీఈఈ మల్లయ్య

తాండూర్, ప్రభాతవార్త



మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి శుద్ధి చేసిన స్వచ్ఛమైన నీటిని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని బెల్లంపల్లి సబ్ డివిజన్ డీఈఈ (ఇంట్రా) మల్లయ్య అన్నారు. మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో జల్ జీవన్ మిషన్ (మిషన్ భగీరథ) ఆధ్వర్యంలో 'జల్ మహోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఈ మల్లయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన, స్వచ్ఛమైన నీటిని పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తోందన్నారు. ప్రజలు బయటి కలుషిత నీటి వనరుల జోలికి వెళ్లి అనారోగ్యాల పాలు కావద్దని, కేవలం భగీరథ నీటినే త్రాగడానికి వినియోగించాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకొని, వనరులను కాపాడుకోవాల్సి సామాజిక బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ల్యాబ్ మైక్రోబయాలజిస్ట్ సిరంగి సంతోష్ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటి నాణ్యత విషయంలో రాజీ పడటం లేదని, అత్యాధునిక ల్యాబ్‌లలో నీటిని నిరంతరం పరీక్షిస్తున్నామన్నారు. మైక్రోబయలాజికల్ ప్రమాణాల ప్రకారం మిషన్ భగీరథ నీరు సురక్షితమని, ప్రజలు ఎటువంటి భయం లేకుండా వాడుకోవచ్చన్నారు. ఏఈఈ మనోహర్ క్షేత్రస్థాయిలో నీటి సరఫరా వ్యవస్థ, ట్యాంకుల నిర్వహణ పనితీరు గురించి గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాసాడి తిరుపతి, వార్డు సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరత అపోహలు నమ్మొద్దు

### - కాగజ్‌నగర్ తహశీల్దార్ మధుకర్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:

కాగజ్‌నగర్ పట్టణ పరిధిలో గ్యాస్ కొరత ఉందనే ప్రచారం పూర్తిగా అపోహ మాత్రమేనని తహశీల్దార్ మధుకర్ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణంలోని రెండు ఎల్పీజీ గోదాములను స్వయంగా పరిశీలించిన ఆయన, గ్యాస్ నిల్వలు, ఖాళీ సిలిండర్ల వివరాలను సమగ్రంగా తనిఖీ చేశారు. గోదాములలో అవసరానికి మించిన స్థాయిలో గ్యాస్ నిల్వలు ఉన్నట్లు తెలిపారు. ఇటీవలి రోజుల్లో "గ్యాస్ అందుబాటులో లేదు" అనే భయంతో ప్రజలు ముందుగానే బుకింగ్‌లు చేసుకుంటున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. అవసరం లేకుండా అడ్వాన్స్ బుకింగ్ చేయడం వల్ల పంపిణీ వ్యవస్థపై ఒత్తిడి పెరిగి, అనవసర అపోహలు మరింత విస్తరిస్తున్నాయని తెలిపారు. ప్రజలు భయాందోళనలకు గురి కాకుండా అవసరమైనప్పుడు మాత్రమే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే వ్యవహరించాలని, అవసరానికి అనుగుణంగా గ్యాస్ సేవలను వినియోగించుకోవాలని తహశీల్దార్ మధుకర్ కోరారు.

## విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. అధికారులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు జవాబుదారీతనంగా వ్యవహరించాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి విధులకు హాజరు కాని 6 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తహసిల్దార్‌ను ఆదేశించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూ సంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిచూసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, వివిధ ధ్రువపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన ఆరోగ్య వైద్య సేవలు అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

తీసుకుంటుందని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణంలో చేపట్టిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి సెప్టెంబర్ నెలలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాల వయసు గల పిల్లలకు హెచ్ పి వి టీకా అందించడం జరుగుతుందని, నవజాత శిశువు నుండి పిల్లలకు సకాలంలో టీకాలు అందించి వారి ఆరోగ్యం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సరైన పోషక ఆహారాలు అందించి పిల్లల ఎదుగుదలకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యవృత్తి సవాళ్లతో కూడుకుందని, వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో పొరుగు సేవలు, ఒప్పంద పద్ధతిన ప్రొఫెసర్లను తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు దయాలసిస్ సేవలు అందించేందుకు తగిన పరికరాలు, సిబ్బంది సమకూర్చడం జరిగిందని తెలిపారు. అసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది గ్రామస్థాయిలో సేవలు అందించాలని, జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని, గిరిజన గ్రామాలలో వైద్య సేవలను అందుబాటులో ఉంచే విధంగా కార్యాచరణ అమలు చేయాలని, పిల్లలు, ప్రజలు సకాలంలో తీసుకోవలసిన పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఇప్ప పువ్వు లడ్డు, అంతర పంటలను సాగు చేసి పోషక విలువలు కలిగిన పంట ఉత్పత్తులను అందుబాటులో ఉంచేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసేందుకు ప్రత్యేక వైద్య నిపుణులు నియమించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేసిన రైస్‌మిల్ యజమానుల అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

మొత్తం 2702.797 మెట్రిక్ టన్నుల వడ్లు లేదా సుమారు రూ.6.91 కోట్ల విలువైన ధాన్యం ప్రభుత్వానికి అందించకుండా అక్రమంగా వినియోగించినట్లు తేలింది. ఈ ధాన్యాన్ని ఇతర రైస్ మిల్లుల ద్వారా కోళ్ల దాణా మరియు ఇతర అవసరాల కోసం విక్రయించి సుమారు రూ.3.8 కోట్లు అక్రమంగా సంపాదించినట్లు పోలీసులు గుర్తించారు. అందులో ఎక్కువ భాగాన్ని వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు వెల్లడైంది. సివిల్ సప్లయ్స్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, సోమవారం నిందితులను అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో మరింత విచారణ కొనసాగుతోందన్నారు. ఇదే సంవత్సరం ఫిబ్రవరి 24న నమోదైన మరో కేసులో కూడా రేణిగుంట్ల పద్మజ, బుద్ధ మాధురి, రేనిగుంట్ల శివకుమార్, బుద్ధ మనీష్ ప్రధాన నిందితులుగా ఉన్నారు. తెలంగాణ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను మోసం చేయాలనే ఉద్దేశంతో సుమారు రూ.7.51 కోట్ల విలువైన నకిలీ బ్యాంక్ గ్యారంటీ సృష్టించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రభుత్వానికి చెందాల్సిన ధాన్యం లేదా బియ్యాన్ని వ్యక్తిగత లాభాల కోసం దుర్వినియోగం చేయడం తీవ్రమైన నేరమని ఎస్పీ నితికా పంత్ పేర్కొన్నారు. నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ ఆదాయాన్ని కాజేయాలని ప్రయత్నించడం చట్టరీత్యా శిక్షార్హమని హెచ్చరించారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## 2వ రోజు ర్యాలీ ఉద్రిక్తం...

# సింగరేణి యాజమాన్యంపై కార్మికుల ఆగ్రహం

**- టెండర్ పేరుతో ఉపాధి దోపిడీ ఆపాలి - ఎస్‌సీకేఎస్-సిఐటియు హెచ్చరిక**



**మందమర్రి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

మందమర్రి డివిజన్ సింగరేణి కాంట్రాక్టు సెక్యూరిటీ కార్మికులు ఎలాంటి షరతులు లేకుండా వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రెండో రోజు కూడా భారీ ర్యాలీ చేపట్టారు. పట్టణంలో మంగళవారం రోజు కోల్ బెల్ట్ ఏరియా పరిధిలోని పాల చెట్టు ఏరియా కాలనీల్లో కార్మికులు ఆందోళనకు దిగుతూ పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొల్పారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఎస్‌సీకేఎస్‌సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ మందమర్రి డివిజన్‌లో పనిచేస్తున్న సుమారు 220 మంది ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు అధికారుల నిర్లక్ష్యం, టెండర్ ఆలస్యం కారణంగా ఒక్కసారిగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడిన దుస్థితి ఏర్పడిందని తీవ్రంగా విమర్శించారు. గత పన్నెండు ఏళ్లుగా సేవలు అందిస్తున్న కార్మికులను టెండర్ రాలేదు అనే పేరుతో పక్కన పెట్టడం వెనుక యాజమాన్యం కుట్ర ఉందని ఆరోపించారు. నెల రోజులుగా కార్మికులను మభ్యపెడుతూ కాలయాపన చేయడం తప్ప స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. సంస్థ ఆస్తులను రక్షించే సెక్యూరిటీ గార్డులకే ఉద్యోగ భద్రత లేకపోవడం సింగరేణి యాజమాన్యం వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎలాంటి షరతులు లేకుండా కార్మికులందరినీ యథావిధిగా విధుల్లోకి తీసుకోకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు సెక్యూరిటీ కార్మికులు పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

**నిర్మల్, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లాలో వేసవికాల క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తి గల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ ప్రకటించింది. ఈ శిబిరాల ద్వారా విద్యార్థులకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను ఈనెల 15వ తేదీలోపు నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రెండో అంతస్తులో ఉన్న జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయం లో అందజేయాలని అధికారులు సూచించారు. అందిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆదేశాలు, నిబంధనల ప్రకారం అర్హులైన వారికి శిక్షణ బాధ్యతలు కేటాయిస్తామని జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని క్రీడా నైపుణ్యం కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

**వేమనపల్లి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

ఒకరిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం వేమనపల్లి గ్రామానికి చెందిన డోకె వెంకటి అనే వ్యక్తి మంగళవారం ఉదయం హనుమంతుని గుడిలో హనుమంతుడికి సింధూరం రాస్తూ పూజలు నిర్వహిస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన ఎల్లెల శ్రీనివాస్ అనే వ్యక్తి మద్యం సేవించిన స్థితిలో గుడిలోకి ప్రవేశించాడు దీనిని గమనించిన వెంకటి, మద్యం సేవించి గుడిలోకి రావద్దని శ్రీనివాసు ను హెచ్చరించాడు. దీనిపై ఆగ్రహించిన శ్రీనివాసు డోకె వెంకటితో వాగ్వాదానికి దిగడమే కాకుండా అక్కడే ఉన్న చెక్క బల్లను తీసుకుని వెంకటి తలపై కొట్టడంతో అతనికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాల మెడిలైఫ్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న నీల్వాయి ఎస్సై వెంటనే మంచిర్యాలలోని మెడిలైఫ్ ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని విచారించి, అక్కడికక్కడే అతని ఫిర్యాదు స్వీకరించి ఆన్ సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందని తెలిపారు.





## నిశ్చితార్థ వేడుకలో బోథ్ ఎమ్మెల్యే

**ఇచ్చోడ, ఏప్రిల్ 06, ప్రభాతవార్త:**

ఇచ్చోడ మండల కేంద్రంలోని బృందావన్ కాలనీలో నిర్వహించిన నిశ్చితార్థ వేడుకకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వర్తమన్నూర్ గ్రామ మాజీ సర్పంచ్ కుర్మె లక్ష్మణ్ కుమార్తెకు, జగిత్యాల ఫైర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కృష్ణకాంత్‌తో నిశ్చితార్థం ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి విచ్చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నూతన వధూవరులను పుష్పగుచ్ఛం అందజేసి నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు విజయ్ మామిడి, మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, ఇచ్చోడ ఉపసర్పంచ్ శిరీష్ రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే బోథ్ సర్పంచ్ కుర్మె అన్నపూర్ణ మహేందర్, బజార్‌హత్నూర్ బీఆర్ఎస్ మండల కన్వీనర్ రాజారామ్, రాజేశ్వర్ రెడ్డి, ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన జంటకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

**- ఆటోను ఢీకొట్టిన బైక్**

**సారంగాపూర్, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:**



సారంగాపూర్ మండల కేంద్రం సమీపంలోని రాంసింగ్ తండా శివారులో సోమవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మహారాష్ట్రలోని శివుని గ్రామానికి చెందిన అస్తపోలు సాయన్న (85) కౌట్ల (బి) గ్రామంలో బంధువు అంత్యక్రియలకు హాజరై తిరిగి ఆటోలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎదురుగా అతివేగంతో ముగ్గురు వ్యక్తులతో (ట్రిపుల్ రైడింగ్) వస్తున్న బైక్ ఆటోను బలంగా ఢీకొట్టింది. బైక్ ఢీకొనకుండా ఆటోను తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సాయన్న అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఆటోలో ఉన్న తిరుపతి, లక్ష్మీతో పాటు బైక్ నడిపిన బజార్ హత్నూర్‌కు చెందిన సంజీవ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.



ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను సన్మానిస్తున్న బాసర ఆలయ పూజారులు

## బాసర అభివృద్ధికి నిధుల మంజూరు

**- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు ఘన సన్మానం**

**భైంసా, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం రూ. 225 కోట్ల భారీ నిధులను మంజూరు చేయించడంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ చేసిన కృషి అమోఘమని ఆలయ పూజారులు, బాసర గ్రామస్థులు కొనియాడారు. మంగళవారం భైంసా పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాసర ఆలయ సమస్యలపై ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శాసనసభలో పలుమార్లు గళమెత్తడం వల్లే నేడు ఈ స్థాయి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. నిన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా బాసరకు విచ్చేసి, తన మనవడికి అక్షరాభ్యాసం చేయించడంతో పాటు రూ. 225 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు కావడం చారిత్రాత్మకమని, ఈ సేవలు నియోజకవర్గ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బాసర గ్రామ ప్రముఖులు, ఆలయ పూజారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## నేడు కంకెట గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

**సారంగాపూర్, ఏప్రిల్ 07, ప్రభాతవార్త**

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని కంకెట గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సాహెబ్ రావు తెలిపారు. కోణార్క్ ఎన్.బి.ఆర్ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించనున్న ఈ శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరం బుధవారం ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు కొనసాగుతుందని ఆయన వివరించారు. కంకెట గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చే ప్రజల కోసం అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించినట్లు సర్పంచ్ వెల్లడించారు. వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడే వారు వైద్య నిపుణుల సలహాలు, సూచనలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఈ నెల 14న అంబేద్కర్ జయంతికి పూర్తి ఏర్పాట్లు చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకల దృష్ట్యా ఈ నెల 14వ తేదీన పూర్తి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తాలో డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, 9.30 గంటలకు నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేయడం జరుగుతుందని, 10 గంటలకు ఇతర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిరంతర విద్యుత్ సరఫరా, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్యం, అలంకరణ, మరమ్మత్తుల నిర్వహణ, త్రాగునీటి ఏర్పాటు, అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యుత్ దీపాలంకరణ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అత్యవసర సేవల నిమిత్తం వైద్య శిబిరం నిర్వహణ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అంబేద్కర్ జయంతి వేడుకలకు అన్ని శాఖల అధికారులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు.



## పశువులకు గాలికుంటు టీకాలు

నేరడిగొండ, ఏప్రిల్ 7,ప్రభాతవార్త:

నేరడిగొండ మండలంలోని సవర్గాం గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాదవ్ కళ్యాణి, మహేందర్, పశువైద్యాధికారి జీవన్, గోపాలమిత్ర సురేష్, ఏ వెంకన్న, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మాజీ బీఎస్ఎఫ్ జవాన్ దుర్మరణం

నేరడిగొండ, ఏప్రిల్ 7,ప్రభాతవార్త:

నేరడిగొండ మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బోథ్ గ్రామానికి చెందిన మాజీ బీఎస్ఎఫ్ జవాన్ జక్కులవార్ మురళి (39) మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. మృతుని సోదరుడు తెలిపిన వివరాల ప్రకారం, మురళి సోమవారం సాయంత్రం ఇంటి నుండి బయటకు వెళ్లారు. రాత్రి 11:30 గంటల సమయంలో నేరడిగొండ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు, శరీరానికి తీవ్ర గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రిన్సిపల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్

## డిగ్రీ కళాశాలలో ఏఐ, సైబర్ సెక్యూరిటీ శిక్షణపై ఒప్పందం

ఇచ్చోడ, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ అంశాలలో శిక్షణ ఇవ్వడానికి భారత్ కేర్ స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదిరింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్, భారత్ కేర్ ప్రతినిధి మహమ్మద్ ఖురేషి మంగళవారం ఈ మేరకు అంగీకార పత్రాలను మార్చుకున్నారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులకు జూన్ నెల నుండి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో 80 గంటల పాటు ఈ శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు లభించే ఇటువంటి ఆధునిక సాంకేతిక శిక్షణను డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా అందించడం సువర్ణ అవకాశమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు. భవిష్యత్తులో మరిన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు కళాశాలలో ప్రవేశాలు పొందడం ద్వారా ఇటువంటి అవకాశాలను పొందవచ్చని ఆయన తెలిపారు.

## ఉట్నూర్ స్పోర్ట్స్ స్కూల్ సందర్శించిన ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు

ఉట్నూర్, ఏప్రిల్ 7, ప్రభాత వార్త :



ఉట్నూర్ పట్టణ లోని కేబీ కాంప్లెక్స్ స్పోర్ట్స్ స్కూల్ నీ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆకస్మికంగా సందర్శించారు . వంట రూమ్ ను తనిఖీ చేసి, ఆహార సామాగ్రిని పరిశీలించారు, విద్యార్థులకు అందించే ఆహారం లో నాణ్యత తప్పనిసరిగా పాటించాలన్నారు. మెనూ ప్రకారమే క్రమం తప్పకుండా టిఫిన్స్ పెట్టాలన్నారు. విద్యార్థులతో ప్లే గ్రౌండ్‌లో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ వార్డెన్ గంగారం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సంతోష్

ఉట్నూర్,ఏప్రిల్ 7, ప్రభాతవార్త





సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సంతోష్

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు సంతోష్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి కార్యాలయ చాంబర్ లో ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ తో కలిసి వివిధ విభాగాల అధికారులతో ఐ టి డి ఎ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి వివరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా సంచాలకులు మాట్లాడుతూ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలోని గిరిజన ప్రాంతాలలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, గిరిజన సంక్షేమం దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హత గల ప్రతి గిరిజనుడికి అందే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతి విభాగం పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు, లక్ష్యాల సాధన, ఎదురవుతున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆరోగ్యం, గిరిజన సహకార సంస్థ (జి సి సి), ఇంజినీరింగ్, విద్య, గురుకులాలు, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఉద్యానవనం, వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, భూ వివాదాలు, అటవీ హక్కుల చట్టం తదితర అంశాలపై ఆయా విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను మెరుగుపరచాలని, సంక్షేమ పథకాల ఫలాలు లబ్ధిదారులకు సమయానికి చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, భూ హక్కులు, త్రాగునీరు, ఆరోగ్య సేవలు, విద్యా రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో 4 జిల్లాల డి డి లు, ఎ పి ఓ (పి వి టి జి), డిప్యూటీ ఈ.ఓ., టి.డబ్ల్యూ. ఈ.ఈ., ఐ టి డి ఎ పరిపాలన అధికారి, ఆరోగ్యశాఖ, గిరిజన సహకార సంస్థ అధికారులు, ఎ టి డి ఓ లు, జె డి ఎం, పెసా సమన్వయకర్త, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## మందమర్రి కాంగ్రెస్ ఇంఛార్జ్‌లకు ఘన సన్మానం

- కొత్త బాధ్యతలపై నాయకులకు శుభాకాంక్షలు వెల్లువ

మందమర్రి, ఏప్రిల్ 4, ప్రభాతవార్త

మందమర్రి బ్లాక్ కాంగ్రెస్ ఇంచార్జ్‌గా డిసిసి వైస్ ప్రెసిడెంట్ బెల్లంకొండ కర్ణసాగర్ రావును, మందమర్రి మున్సిపాలిటీ ఇంచార్జ్‌గా డిసిసి సెక్రెటరీ గోపతి బానేష్‌ను నూతనంగా నియమించడాన్ని పురస్కరించుకుని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మందమర్రి పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ జనరల్ సెక్రటరీ సొతుకు సుదర్శన్, మండల అధ్యక్షులు కదారి జీవన్ కుమార్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా, మైనారిటీ నాయకులు జమీల్, సీనియర్ నాయకులు ఎర్ర రాజు, బుర్ర ఆంజనేయులు, రాచర్ల గణేష్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మాయ తిరుపతి, సేవాదళ్ పట్టణ అధ్యక్షులు సొతుకు ఉదయ్ కుమార్, యువజన నాయకులు రాయబారపు కిరణ్, మూడారపు శేఖర్ తదితరులు పాల్గొన్నారు. నాయకులను శాలువాలతో సన్మానించి, స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## కలమడుగులో ఎల్లమ్మ బోనాలకు హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త



జన్నారం మండలం కలమడుగు గ్రామంలో జరిగిన ఎల్లమ్మ పట్నాలు, బోనాలకు ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అద్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని, పంటలు మంచిగా పండి రైతులు ఆనందంగా ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పొనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, ఏఎంసి చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై అవగాహన పెంపే లక్ష్యం

- మెడికల్ సూపరింటెండెంట్ డా. అవినాష్

కాగజ్‌నగర్,ఏప్రిల్ 7, ప్రభాతవార్త:



కాగజ్‌నగర్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. మెడికల్ సూపరింటెండెంట్ డా. అవినాష్, ఆర్ఎంఓ డా. శ్రీధర్ ఆధ్వర్యంలో డాక్టర్లు, నర్సులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఆసుపత్రి ప్రాంగణం నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా పాల్గొన్న వారు ఆరోగ్య పరిరక్షణపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. పరిశుభ్రత పాటించడం, సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు.ప్రజలు తాగునీరు శుభ్రంగా వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వైద్యులు సూచించారు. చిన్న అనారోగ్యాన్ని కూడా నిర్లక్ష్యం చేయకుండా సమయానికి వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధుల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రస్తుత కాలంలో జీవనశైలి మార్పులతో మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు పెరుగుతున్నాయని, వాటిని నియంత్రించేందుకు సరైన ఆహారం, వ్యాయామం అవసరమని పేర్కొన్నారు. ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లను దూరం పెట్టాలని సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు. ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే గుర్తించి నివారించవచ్చని తెలిపారు.మహిళలు, చిన్నారులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, గర్భిణీలు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పిల్లలకు పోషకాహారం అందించడం ఎంతో ముఖ్యమని వివరించారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయనున్నట్లు వెల్లడించారు.

## గిరిజనుల సమస్యలను పరిష్కరించండి

ఉట్నూర్, ఏప్రిల్ 7,ప్రభాత వార్త :

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని అల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ భీమ్ రావు నాయక్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ కార్యాలయం లో ట్రైబల్ కమిషనర్, ట్రైబల్ వెల్ఫేర్ యసి లను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. భీమ్ రావు నాయక్ మాట్లాడుతూ ర్నాష్ట్ర లో నివసిస్తున్న గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఏ ఓ దామోదర్ స్వామి, డి డి అంబాజీ,పీవీటి జి ఏ పి ఓ ఆత్రం భాస్కర్,హిందూ ఉత్సవ సమితి ఉట్నూర్ అధ్యక్షులు గుగ్లోత్ శ్రీరామ్ నాయక్, ఆడే ధనలాల్ తదితరులు పాల్గొన్నారు.

# బుద్ధ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి సాధారణ సెలవు ప్రకటించాలి

**- సబ్ కలెక్టర్ కార్యాలయంలో బౌద్ధ సంఘాల వినతి**

**కాగజ్‌నగర్ రూరల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

బుద్ధ జయంతి (బుద్ధ పౌర్ణిమ)ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడంతో పాటు సాధారణ ప్రజా సెలవు దినంగా ప్రకటించాలని భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాగజ్‌నగర్ స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓ అధికారికి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం విస్తారు, తాలూకా అధ్యక్షుడు కొండగుర్లే దేవాజి, ప్రధాన కార్యదర్శి కొండగుర్లే గణపతి మాట్లాడుతూ, వచ్చే నెల మే 1న ప్రపంచానికి శాంతి సందేశం అందించిన తథాగత గౌతమ బుద్ధుని 2570వ బుద్ధ జయంతి (వైశాఖ పౌర్ణిమ) సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం జనరల్ పబ్లిక్ హాలిడేగా ప్రకటించి, అధికారికంగా బుద్ధ జయంతి వేడుకలు నిర్వహించాలని కోరారు. దేశంలోని 15 రాష్ట్రాల్లో ఇప్పటికే బుద్ధ పౌర్ణిమ రోజున సెలవు అమల్లో ఉందని, తెలంగాణలో కూడా అదే విధంగా అమలు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహాత్మ జ్యోతిబా ఫూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, డాక్టర్ జగజీవన్ రామ్, సేవాలాల్, కొమరం భీం తదితర మహనీయుల జయంతులను అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపించిన గౌతమ బుద్ధుని జయంతిని కూడా అదే స్థాయిలో నిర్వహించాలని వారు కోరారు. అదేవిధంగా, జిల్లాలోని బుద్ధ విహారాలలో పూజలు నిర్వహించే బౌద్ధ భిక్షువులకు గౌరవ వేతనం చెల్లించాలని కూడా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గం విక్రమ్, పిత్ర ప్రభాకర్, దుర్గం మాధవ్, ముర్మాడే నరసయ్య, దుర్గం వెంకటేష్, మానపల్లి ప్రభాకర్, కొండగుర్లే మారుతి, దుర్గం పుండలిక్, దుర్గం రామచందర్, ఎం. శివకుమార్, దుప్త సూర్యకుమార్, రౌతు దేవాజీ తదితరులు పాల్గొన్నారు. బౌద్ధ బాంధవులు, అంబేద్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



వినతిపత్రం అందజేస్తున్న బౌద్ధ సంఘాల ప్రతినిధులు

## ఉద్యోగాలు ఇవ్వలేక కార్మిక సంఘాలను బదనాం చేసే పద్ధతి మానుకోవాలి

**- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జనరల్ సెక్రటరీ తుమ్మల రాజారెడ్డి**

**- ఆర్.కె-5 గనిపై సీఐటీయూ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్**

**నస్పూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

ఉద్యోగాలు ఇవ్వలేక కార్మిక సంఘాలను బదనాం చేసే పద్ధతి మానుకోవాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జనరల్ సెక్రటరీ తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్.కె-5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అసెంబ్లీ వేదికగా కార్మిక సమస్యలను పరిష్కరించాల్సింది పోయి సంఘాల ఫిర్యాదు వల్లే మెడికల్ బోర్డు ఆపామని చెప్పడం సరికాదని విమర్శించారు. యువ కార్మికుల వల్ల సంస్థ ఆర్థికంగా నష్టపోతుందనే వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ నెలలోనే మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని, మెడికల్ దందాలో ఉన్న నాయకులు, అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. గనులలో స్థానిక సమస్యలు పెరిగిపోతున్నాయని డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి రాజేందర్ ఆరోపించారు. కార్మికులకు డ్రిల్ బిట్లు, నాణ్యమైన డ్రిల్ రాడ్లు, గ్లౌజులు, ఇతర పనిముట్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. పని స్థలాల్లో కనీసం తాగునీటి వసతి కూడా కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గెలిచిన సంఘాల నాయకులు గనుల్లోకి దిగి పనిచేయకపోవడం వల్లే ఈ సమస్యలు పేరుకుపోయాయని విమర్శించారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న ఇబ్బందులను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కార్మిక సంఘాల పట్ల ఒకే విధంగా ఉందని రాజారెడ్డి విమర్శించారు. ఏఐటీయూసీ నాయకులు పెద్దన్న పాత్ర పోషించి అన్ని సంఘాలతో జేఏసీ ఏర్పాటు చేసి ప్రభుత్వంపై పోరాడాలని సూచించారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఎనర్జీ సెక్టార్‌ను ఏకం చేసి నిరవధిక సమ్మె చేయడానికి జాతీయ స్థాయిలో చర్చలు జరుపుతున్నామని వెల్లడించారు. సోషల్ మీడియాలో విమర్శలు చేసే నాయకుల పట్ల కార్మికులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు శ్రీనివాస్, చిగురు లక్ష్మణ్, బట్టు సురేందర్, పోతు వెంకటేష్, తోట విజయ్ సహా పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.





## బీసీ డిమాండ్ల సాధనకై 24 గంటల నిరవధిక దీక్ష

**మంచిర్యాల, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

మంచిర్యాల పట్టణంలోని గాంధీ పార్క్‌లో మంగళవారం రోజు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ డిమాండ్లు పరిష్కరించడంలో నిర్లక్ష్య వైఖరికి నిరసనగా జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 24 గంటల నిరావధిక దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ జెవి రాజు న్యూ ఇండియా పార్టీ, బీసీ ఐక్య సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు పెద్దంపేట శంకర్, తెలంగాణ గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షులు నిన్నెలా నరసయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నీలకంఠేశ్వర్ గౌడ్ దీక్షలో పాల్గొన్న వారికి పూలమాల ధరింపజేసి దీక్ష ప్రారంభించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా దేశంలో రాష్ట్రంలో బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యమాలు నడుస్తున్నప్పటికీ దేశాన్ని అత్యధిక సంవత్సరాలు పరిపాలించిన కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలో ఉన్న బిజెపి అలాగే రాష్ట్రంలో అధికారంలో గతంలో ఉన్న టిఆర్ఎస్ ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏ ఒక్క బీసీ డిమాండ్లను పరిష్కరించిన పాపాన పోలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం లాగే బీసీ సామాజిక రక్షణ భద్రతకై బీసీ యాక్ట్ ఏర్పాటు చేయాలి. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు రద్దు చేయాలి. 50 శాతం సీలింగ్ రిజర్వేషన్ ఎత్తివేయాలి. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన బీసీ అంశాలను అమలు చేయాలని, రాష్ట్రంలో ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. బీసీ యాక్ట్ ఏర్పాటు చేయాలి. ఐదేళ్లలో లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తాం అన్న హామీని అమలు చేయాలి. ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి. మా న్యాయమైన డిమాండ్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, సీనియర్ నాయకులు న్యాయవాది కర్రె లచ్చన్న, గజ్జెల్లి వెంకటయ్య, వేముల అశోక్, గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షులు వెన్నెల నరసయ్య, బీసీ ఐక్య సంఘర్షణ సమితి అధ్యక్షులు పెద్దంపేట శంకర్, న్యూ ఇండియా పార్టీ అధ్యక్షులు డాక్టర్ జె వి రాజు, రామగిరి రాజన్న చారి, కొత్తకొండ రమేష్, మంచెర్ల సదానందం, చంద్రగిరి చంద్రమోళి, కీర్తి బిక్షపతి, డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్, ఎర్రోళ్ల రాజు, సురేంద్ర చారి, శెట్టిపల్లి ఘట్టయ్య తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

## ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**ఉట్నూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**

మండలంలోని బాబా పూర్ గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పనులను మంగళవారం సర్పంచ్ మెస్రం గంగాదేవి ప్రభాకర్ ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ భూముల్లో మట్టి కాలువల తవ్వకాల పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు ఉపాధి హామీ కూలికి పని కల్పించేలా చూడాలని రైతులకు ప్రజలకు ఉపయోగపడే పనులను చేయాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు శాలువాలతో సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

## ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు సన్మానం

**ఉట్నూర్, ఏప్రిల్ 7, ప్రభాత వార్త :**

ఉట్నూర్‌లోని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రితీష్ నివాసంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ సుమన్ బాయి నేతృత్వంలో ఈ కార్యక్రమంను జరుపుకున్నారు. ఖానాపూర్ మున్సిపాలిటీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన అంకం మోనిక మహేందర్, కౌన్సిలర్లుగా ఎన్నికైన సత్యవతి, గుమ్ముల ఆనంద్ దంపతులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాథోడ్ సుమన్ బాయి మాట్లాడుతూ, ఖానాపూర్ పట్టణ ప్రజలకు మంచి సేవలు అందించి ప్రజల్లో మరింత గుర్తింపు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ బీజేపీ మండల అధ్యక్షుడు బింగి వెంకటేష్, బీజేపీ నిర్మల్ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, నాయకులు కల్వ రవి, రాథోడ్ శేషారావు, సీపతి లింగ గౌడ్, సాడిగే రాజేశ్వర్, శ్రీనివాస్, ఉగ్గే విజయ్, అర్జున్ సింగ్, గాలి శ్రీకాంత్, పొన్నం జగన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్వో ప్లాంటను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**

ఆర్వో ప్లాంటను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి, డిఎఫ్ఓ నీరజ్ కుమార్ లు పేర్కొన్నారు. మంగళవారం ఆసిఫాబాద్ మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో తాగునీటి శుద్ధి కేంద్రాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించడం చాలా ముఖ్యమని, అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఆర్వో ప్లాంట్ ద్వారా విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. డిఎఫ్ఓ నీరజ్ కుమార్ టిబ్రేవాల్ మాట్లాడుతూ అటవీ శాఖ సమాజ సేవలో భాగంగా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో గోవింద్ చంద్ సర్దార్, డిప్యూటీ ఆర్వో యోగేష్ కుల్కర్ని ఎఫ్ఎస్ఓ మహేందర్, ఎఫ్ బీ ఓ రాజేశ్, వెంకటేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వాతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





అగ్నిమాపక యంత్రాల వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జిల్లా ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ

## వేద ఆగ్రో ఫ్యాక్టరీలో ఫైర్ మాక్ డ్రిల్

### - ప్రమాద నిరోధక అవగాహన కార్యక్రమం

**నిర్మల్, ఏప్రిల్ 07, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని వేద ఆగ్రో ఫ్యాక్టరీలో "ప్రమాద నిరోధక ప్రజా సురక్ష" (99 రోజుల కార్యక్రమం)లో భాగంగా మంగళవారం ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాల నుండి ప్రాణ, ఆస్తి నష్టాలను ఎలా నివారించాలో, అగ్నిమాపక యంత్రాలను ఏ విధంగా ఉపయోగించాలో వివరించారు. ప్రమాద సమయంలో అనుసరించాల్సిన అత్యవసర మార్గాలు, బాధితులకు అందించాల్సిన ప్రథమ చికిత్సపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని అధికారులు పేర్కొన్నారు. ప్రజల్లో భద్రతా భావన పెంపొందించేందుకు ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి లక్ష్మీకుమారి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి రాజేష్, వేద ఆగ్రో డైరెక్టర్ విజయ్, ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు. మాక్ డ్రిల్ నిర్వహణ ద్వారా ప్రమాద సమయాల్లో తక్షణమే స్పందించేలా సిబ్బందికి అవసరమైన పరిజ్ఞానం లభించిందని వారు పేర్కొన్నారు.



సర్టిఫికెట్లు స్వీకరిస్తున్న విద్యార్థులు

## శ్రీ చైతన్య స్కూల్‌లో 5వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

### - తల్లిదండ్రుల గర్వం.. విద్యార్థుల ఆనందం

**మందమర్రి, ఏప్రిల్ 07, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ కేంద్రంలో గల శ్రీ చైతన్య పాఠశాలలో 5వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడ్డాయి. విద్యార్థుల విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన దశ పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ వేడుకలో చిన్నారులు ఆకర్షణీయమైన గ్రాడ్యుయేషన్ గౌన్లు, క్యాప్స్ ధరించి హాజరై అందరినీ ఆకట్టుకున్నారు. టోపీలు ఎగరేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేసిన విద్యార్థుల సందడి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ, ప్రాథమిక విద్య పూర్తి చేసి ఉన్నత తరగతుల వైపు అడుగులు వేస్తున్న విద్యార్థులకు ఇది ఒక మధురమైన మైలురాయి అని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువులో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని, తల్లిదండ్రులు మరియు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు, పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. కొన్ని విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ భావోద్వేగ క్షణాలు కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల విజయాన్ని గర్వంగా చూసుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆశీర్వదించారు. ఈ వేడుకలో పాఠశాల ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంతోషకర వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం అందరికీ చిరస్మరణీయంగా నిలిచింది.

# ఓపెన్ స్కూల్ వార్షిక పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**

తెలంగాణ ఓపెన్ స్కూల్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, జిల్లా విద్యాధికారి లలిత, పరీక్షల సహాయ కమిషనర్ జనార్ధన్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 20 నుండి 24వ తేదీ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు జరగనున్న ఎస్ ఎస్ సి పరీక్షలకు హాజరయ్యే 643 మంది విద్యార్థుల కొరకు 3 పరీక్ష కేంద్రాలు, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే 360 మంది విద్యార్థుల కొరకు 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్ టి సి అధికారులు బస్సులు నడిపించాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలో అత్యవసర వైద్య సేవలు నిమిత్తం వైద్య సిబ్బంది, మందులు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుండి మే 5వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ థియరీ, ప్రాక్టికల్ నిర్వహణ కొరకు తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో త్రాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని, జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలో పరీక్షలు సజావుగా సాగేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్

## సామాన్యులకు అందుబాటులో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడం అభినందనీయం

### - మంచిర్యాల మేయర్ ధర్మి మధుకర్

### - సృష్టి నవోదయ సైనిక్ స్కూల్ 13వ వార్షికోత్సవం

**నస్పూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**

సామాన్యులకు అందుబాటులో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడం అభినందనీయమని మంచిర్యాల మేయర్ ధర్మి మధుకర్ అన్నారు. నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్‌లో గల నరసయ్య భవనంలో మంగళవారం సృష్టి నవోదయ సైనిక్ స్కూల్ 13వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ నవోదయ, సైనిక్ పాఠశాలల ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన శిక్షణ అందిస్తున్న పాఠశాల యాజమాన్యం కృషిని ఆయన కొనియాడారు. లక్షల రూపాయల ఫీజులు చెల్లించి కార్పొరేట్ పాఠశాలల్లో చదివించలేని వారికి ఈ విద్యాసంస్థ అండగా నిలుస్తోందని ధర్మి మధుకర్ తెలిపారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో నడుపుతున్న నవోదయ, సైనిక్ పాఠశాలల్లో సీట్లు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నవోదయలో సీట్లు సాధించిన అనుశ్రీ, దీప్తి, కృషిత, నవదీప్, ప్రణీత్, సంజావిలను మేయర్ ప్రత్యేకంగా సత్కరించారు. జాతీయ స్థాయి సైనిక్ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన అంబాల రిహాన్ తేజ, పృథ్వీలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సృష్టి డైరెక్టర్లు అంబాల రాజ్ కుమార్, భాస్కర్ రెడ్డి పాఠశాల విజయాలను వివరించారు. పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మండల విద్యాధికారి పద్మజ, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్ర పాణి, జిల్లా ట్రెజరర్ కృష్ణారెడ్డి, ఉపేందర్, మండల ట్రస్మా అధ్యక్షులు మైదానం రామకృష్ణ, అమన్ ప్రసాద్, దేవన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ప్రవేశ పరీక్షల్లో సీట్లు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న మేయర్ దర్మి మధుకర్



### ఆడపిల్ల పుడితే సంతోషంగా

## వేడుక జరుపుకోవాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**

ఆడపిల్ల పుడితే సంతోషంగా వేడుక జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భేటీ జన్మోత్సవ్ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి , సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం ద్వారా ఆడపిల్లలను కాపాడుకుందాం, చదివించుకుందాం, ఎదగనిద్దాం నినాదంతో ఆడపిల్లల అభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. లింగ వివక్ష లేకుండా పురుషులతో సమానంగా మహిళలకు అన్ని రంగాలలో ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుందని, మహిళల ఆర్థిక అభివృద్ధి కొరకు అనేక పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందించి వ్యాపార రంగాలలో రాణించేందుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. మహిళల ఆరోగ్యం దృష్ట్యా స్వయం సహాయక సంఘాల మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధితో కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం భేటీ జన్మోత్సవ్ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు కావలసిన 12 రకాల వస్తువులతో కూడిన 10 బేబీ కిట్లను అందజేశారు. అంగన్వాడి టీచర్లకు విధుల నిమిత్తం 871 4జి మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి, ఎసిడిపిఓలు, సూపర్ వైజర్లు, అంగన్వాడి టీచర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.